# పార్వతి సంసారం

పార్వతిమొగుడికి పార్వతి అంటే ఎంత ప్రీతో పార్వతికి మొగుడంటే అంత ఆపేక్ష. ఇందుకు సాక్ష్యం యిరుగమ్మ పొరుగమ్మలూను.

మొదటిరోజుల్లో పార్వతి మొగుడికి తనపెళ్లాం "వ్యాంప్ గరల్స్" కంటేన్నూ, ఊర్వశికంటేనూ, మేనమామకూతురు కంటేనూ అందంగా కనిపించేది. పార్వతినే అంటే "మా వారేం....మాఆయనేం...." అని అడగని వాళ్ళదిపాపంగా. ఎంతో ముచ్చటగా సంబరపడుతూ, తన మొగుడేదో రూపంలో మన్మధుడూ బుద్ధిలో బృహస్పతీ అయినట్టు చెప్పుకునేది.

పార్వతిమొగుడు రాజకుమారుడూ, కాపిటలిస్టూ, సామ్య వాదీకాడు. అంచేత ఉదరపోషణకీ కుటుంబపోషణకీ తాలూకాఫీసులో గుమాస్తా అవవలసివచ్చింది. పదకొండు గంటలకి పనిలోకి పోయి, సాయంత్రం ఆరుగంటలకిగాని వచ్చేవాడు కాదు,

యీఎడబాటు ప్రథమంలో యిద్దరికీ భరింపరానిదై పో యింది. గత్యంతరం లేదుగా - రెక్కలమ్ముకున్నతర్వాత, అంతకీ ఆదివారాలకోసం, పండుగలకోసం - చంద్రుడి కోసం చూస్తాయి అవేం పిట్ట - చకోరపక్షుల్లా ఎదురు చూసేవారు.

మొగుణ్ణివదలి పండక్కైనా పుట్టింటికి వెళ్ళలేకపోయిన పార్వతికి, ఒకసంవత్సరం సంసారం చేసేటప్పటికి తన మొగుడు మన్మధుడూ కాదు, బృహస్పతీ లేదు అని తెలిసిపోయింది. అంచేత ఒక్కసారి పుట్టింటికి వెళ్ళి రావాలని అనిపించింది.

పార్వతిమొగుడికి పార్వతి యిప్పుడు బాగా అలవాటై పోయింది. దాంతో పూంఫ్‌గరల్ కాదు, ఊర్వశీ కాదు అని తేలిపోయింది. తన మేనమామకూతురు ఎన్నోరెట్లు నయం. ఆవిడలోవున్న చమత్కారం - చాతుర్యం - దీని మొహం దీనికెలా వస్తాయి? అనుకునేవాడు.

పార్వతి భర్త అనుజ్ఞ పుచ్చుకుని తన తమ్ముణ్ణి రప్పించుకుని పుట్టింటికి వెళ్ళింది. సావిత్రీ గౌరీదేవి నోములు నోచుకుంది. ఇంకా కాపరానికి వెళ్ళనివాళ్ల మొగుళ్ళ పేర్లు, తనో పెద్దరికం చెలాయిస్తూ చెప్పించింది. ఎలాగైతేనేం, నెల్లాళ్ళయేటప్పటికి - "మీఅల్లుడికి హోటల్‌భోజనం పడదు" అంటూ స్వస్థలం చేరుకుంది.

ఈలోగా పార్వతిమొగుడికి పార్వతి గురించిన తలంపే రాలేదనుకోవడం దురన్యాయం. భోజనం సరిగా అమరనపుడు ఆమెమాట గుర్తుకువచ్చేది. దోమలతోనూ నల్లులతోనూ అసలే నిద్రపట్టక ఛస్తూవుంటే పక్కమేడలోని కనన్‌దేవి కంఠధ్వని తనకి నానాచికాకూ కోపం తెప్పిస్తున్నవేళ పార్వతి వెలిగించే అగరువత్తుల సువాసన జ్ఞప్తికి

వచ్చేది. "వెధవ గ్రామఫోనులు.... కేసుపెడితే.... మా తాసి ల్దారుతో చెబితే..." అనుకుంటూ అతికష్టంమీద నిద్ర తెప్పించుకునేవాడు.

రెండో సంవత్సరానికి రంగం మారిపోయింది. ప్రవృత్తులలో భిన్నంమాత్రం వస్తోంది కాని వేషాలుమాత్రం అవే.

"ఇంతవరకూ వంట ఏడవకపోతే ఎలా ?". అన్నాడు పార్వతి మొగుడు.

"మీరు తెచ్చిన కట్టెలు మండిచావందే" అని పార్వతి సమాధానం.

అపశృతి వినిపిస్తోంది. కాని వినేందుకు పార్వతిమొగుడికి చెవులూలేవు. తీరికా లేదు. రెక్కలమ్ముకున్నాడు. వాటికి బుద్ధి తణఖా.

మధ్యాహ్నమపుడు రాత్రి పెరుగుకి పాలు తోడేసినతరువాత విశాలమైన పెద్దమంచంమీద సోమరిగా పడుకుని వీధిని పోయేవాళ్ళని పరిశీలించేది. బానిసత్వమూ జీవిత నిరర్ధకతా ఆవిణ్ణి వెక్కిరించేది. వ్యక్తిత్వం లేనిపార్వతి ఆవేళాకోళాన్ని దొలిచి చూడగలిగే నిశితదృష్టి లేక పక్కభాగంలో వున్నవారింటికి "మీ పాప ఏంచేస్తోంది ?"అంటూ వెళ్లేది.

తను ఏ ఆలోచనలనుంచైతే పారిపోవాలని ప్రయత్నించేదో అవి పార్వతి ప్రయత్నంకంటె ఘట్టిదైన సంకల్పాన్ని హేతుభూతంగా చేసుకున్నవవడంచేత. ఆవిణ్ణిదోబూచు

లాటలో పల్టీలు కొట్టించేవి. అర్ధరాత్రివేళ నక్షత్రాలతో చెలిమిచెయ్యడం ప్రారంభించి, గురకపెట్టి నిద్రపోగలిగిన తన భర్త సౌఖ్యానికి అసూయ పడేది.

తనకానిద్ర ఎందుకు పట్టదు? తనహృదయంలో ఆరాటానికి అర్థమేమిటి? తనని కలవరపరచే అశాంతి నివృత్తి కాదా?

చదివిన నవలలూ చూసిన సినీమాలూ లోపమంతా మొగుడివన్నాయి. అంచేత పార్వతి జీవితంలో పార్వతి ప్రియుడు ప్రవేశించేడు. పార్వతి చిన్నప్పుడు క్లాసుపుస్తకాల్లో నీతికథా, తారకథా చదివింది. కాని, వాళ్లమ్మ పురాణ సారసంగ్రహం మెదడులోకి బాగా ఎక్కించలేదు. కనక, ప్రియుణ్ణి స్వీకరించేముందు ఆమె ధర్మాధర్మ విచక్షణ ఏమీ సంకోచించలేదు. బంగనాయికని అనుసరించింది. తనకి సౌఖ్యం లేదు. జీవితమే సుఖాన్వేషణగా!

మధ్యాహ్నం ప్రియుడుహస్తాల్లో నలిగి అలసిపోయే పార్వతి తమ్ము మరిచిపోయిందిగదా అని చురచురచూసేవి నక్షత్రాలు. ఆమె పగడాల తావళంవైపు భార్యమొహంలో తాండవించే ఉత్సహమూ కొంత్తదనమూ ఒక్కనాడూ కనిపించలేదు పార్వతిమొగుడికి.

ఆరునెలల అనంతరం, యిరుగమ్మలూ పొరుగమ్మలూ దవడలు నొక్కుకున్న చాలకాలానికి ఒక శ్రేయోభిలాషి పార్వతినడత పార్వతి మొగుడికి చెప్పాడు.

అతను యింటికి వచ్చి వుగ్రుడై పోయి, "నా వంశానికి అప్రతిష్ట తీసుకువచ్చావ్! నా గౌరవం నేలపాలు చేశావ్!" యింకా చాలా చాలా అన్నాడు. ఆవిడ సమాధానం చెప్తే నా!! నిందుకుంద.

"ఇలాంటివి నా యింట్లో సాగవు" అన్నాడు. సినీమా "విలన్" లా.

"అయితే వెళ్ళిపోతానులెండి" అంది పార్వతి.

హడలిపోయేడు అధికారి, శ్రుతి మించిపోయింది. ఏం చేస్తాడు? ఆరాత్రి అతను పడ్డక్షోభ భగవంతుడికే తెలియాలి.

దీన్ని నాలుగుతంతే....వీధిని పడుతుందేమో! అదేమిటయ్యా, ఆడదాన్ని చెయ్యిచేసుకుంటా వంటారు.

రౌడీలజేత వాణ్ణి తన్నిస్తే....రౌడీలనగా ఎలావుంటారు? వాళ్లెక్కడ దొరుకుతారు! తనకి పరిచయంలేందే అలాంటి వాళ్ళతో!

ఇల్లుమారితే....దిక్కుమాలిన ఆలోచన. కొత్త యిల్లు వాడికి తెలియకపోతుందా?

తలిదండ్రుల సహాయమర్థిస్తే....పెళ్ళాన్ని జాగర్తచేసుకోలేని వెర్రివాజమ్మ - అంటారు.

ఏందారి? ఏదారీ కనిపించడం లేదు. పార్వతిమాత్రం బయటవరండాలో నులకమంచం వేసుకు హాయిగా నిద్ర పోతోంది.

తెల్లారింది. జ్యోతుల్లాంటి కళ్ళతోనూ, వాడిపోయిన మొహంతోనూ ప్రత్యక్షమైన మొగుణ్ణి చూడగానే జాలేసింది పార్వతికి. గడిచిన మధురానుభవాల స్మృతి ఆమె హృదయంలో తళుక్కుమంది.

"రాత్రి నిద్ర పట్టలేదా ?" అని అడిగింది.

"ఉహూ"

"ఎందుకలా బాధపడతారు ?"

"పోదూ, నువ్విలా చేస్తావనుకోలేదు."

"నే నేమీ చెయ్యలేదు. చేస్తానని అనుకోకండి."

"నమ్మనా ?" అన్నాడు పార్వతి మొగుడు.

"నమ్మండి"

ఆనాటినుంచి యీనాటిదాకా పార్వతిమొగుడు పార్వతి మాటే నమ్ముతున్నాడు. పార్వతిప్పుడు ముగ్గురుబిడ్డలతల్లి.

(నవంబరు '43)